క్లుప్తంగా

రెండు పాఠశాలల తనిఖీ

కొత్తపల్లి(గంపలగూడెం):గంపలగూడెం మండలం కొత్తపల్లిలో మెయిన్, హెచ్‌డబ్ల్యూ ఎలిమెంటరీ పాఠశాలలను మండల విద్యాశాఖాధికారి బి. సోమశేఖర్ నాయక్ మంగళవారం తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, జగనన్న గోరుముద్ద మెనూ అమలు, మరుగుదొడ్ల నిర్వహణ తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించి తగిన సూచనలు ఇచ్చారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా వంట ఏజెన్సీ మహిళలతో మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలుచేస్తూ, రుచిగా, సుచిగా ఆహార పదార్థాలు వండి అందజేయాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు కె. వెంకటేష్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత

ఎ.కొండూరు:మండలంలోని కంభంపాడు గ్రామంలో మంగళవారం హోప్ అర్గనైజేషన్ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు పౌష్టికాహారం ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. హోప్ సంస్థకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సంస్థ డైరెక్టర్ దాసరి ఫణీంద్ర శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలో ఉన్న దివ్యాంగ పిల్లలకు ప్రతినెలా పోషకాహార ప్రదార్థాలు అందజేస్తామన్నారు. కందిపప్పు, వేరు శనగలు, బెల్లం, గోధుమ పిండి పంపిణీ చేశారు. సంస్థ ఫౌండర్ బి. విశ్వభారతి, ప్రధాన కార్యదర్శి ఎం. రాజశేఖర్, కె. లక్ష్మణరావు, పవిత్ర కుమార్, ఉపాధ్యాయులు రామ నాయక్, ఉమాదేవి పలువురు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



గంపలగూడెం: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గంపలగూడెం భజన మందిరంలో జట్ వికాస తరంగిణి ఆధ్వర్యంలో మంగళవారం 27 పర్యాయాలు హనుమాన్‌చాలీసా పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా 25వ రోజు తిరు ప్పావై పఠనం గావించారు. జట్‌వికాస తరంగిణి అధ్యక్షురాలు కొల్లా కృష్ణకుమారిని భక్తులు శాలువా కప్పి సన్మానించారు.

కొనసాగుతున్న త్యాగరాజ ఉత్సవాలు

తిరువూరు: త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా పట్టణంలోని చంద్రమౌళీశ్వరాలయ ప్రాంగణంలో మంగళవారం పూజలు చేశారు. వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని వేదపండితులు నిర్వహించారు. కొల్లిపర శ్వేత గాత్రకచేరీ, నెమ్మలూరు చంద్రశేఖర్ ఆధ్యాత్మికోపన్యాసం, యండూరి శిఖామణి భాగవతారిణి హరికథాగానం చేశారు. త్యాగరాజ గానకళాసమితి కార్యదర్శి మురుకుంట్ల సీతారామలింగేశ్వరశర్మ పర్యవేక్షించారు.

వ్యాయామంతో వ్యాధులు దూరం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం):ప్రతి రోజూ కొద్దిపాటి వ్యాయామం, సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా వ్యాధులు దరిచేరవని కార్డియాలజిస్ట్ ప్రియాంక తెలిపారు. గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపు కార్మికులకు రైల్వే వైద్యశాల డాక్టర్ సుమలత ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియాంక మాట్లాడుతూ గుండె సంబంధిత జాగ్రత్తలు వివరించారు. అనంతరం ఎండోక్రినాలజిస్ట్ డాక్టర్ రాకేష్‌తో కలసి 65 మంది కార్మికులకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రైల్వే వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

పంటల నమోదు ప్రక్రియ ప్రారంభం

మూలపాడు(ఇబ్రహీంపట్నం):గ్రామాల్లో రబీ సీజన్ పంటల నమోదు ప్రక్రియ ప్రారంభమైనట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి శైలజ తెలిపారు. మూలపాడు ఆర్బీకే పరిధిలో రబీ పంటల నమోదు ప్రక్రియ మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ ఏడాది రబీలో వరి, మొక్కజొన్న, జొన్న, శెనగలు, నువ్వులు, కూరగాయల పంటల సాగు ఇప్పటికే రైతులు చేపట్టారన్నారు. సుమారు 5,098 ఎకరాల సాగు ఉంటుందని చెప్పారు. ఆర్బీకేల్లో ఏఏవోల ద్వారా పంటల నమోదు చేయించుకుని ఆతర్వాత ఈకేవైసీ కూడా చేయించాలన్నారు. సందేహాలు ఉంటే ఇంటిగ్రేటెడ్ కాల్ సెంటర్ (గన్నవరం) టోల్‌ఫ్రీ నెంబర్ 155251 కు ఫోన్ చేయాలన్నారు.

సచివాలయం తనిఖీ

మునునూరు: సచివాలయ సిబ్బంది ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉండి సమగ్ర సేవలు అందించాలని ఎంపీడీఓ జి.రాణి ఆదేశించారు. మండలంలోని కాట్రేనిపాడు గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించారు. పథకాల అమలులో నిర్లిప్తత, నిర్లక్ష్యాన్ని, అనుమతిలేని గైర్హాజరు, అధికార దుర్వినియోగాన్ని ఎట్టి పరిస్థితిలోనూ సహించబోమని హెచ్చరించారు. సర్పంచ్ సుహాసిని, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా సంక్షేమ పథకాలు

తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

కొత్తపల్లి(గంపలగూడెం): కరోనా లాంటి కష్టకాలంలో కూడా దేశానికి ఆదర్శంగా అనేక సంక్షేమ పథకాలు అమలుచేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దుక్కుతుందని తిరువూరు శాసనసభ్యులు కె. రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం మండలం కొత్తపల్లిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఆయా కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఇప్పటి వరకు చేకూరిన ప్రయోజనం వివరిస్తూ, ముద్రించిన కరపత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రజల సమస్యలు గురించి అడిగి తెలుసుకొన్నారు. జగనన్న పాదయాత్ర సందర్భంగా ప్రజా సమస్యలను తెలుసుకొని ప్రతి గడపకు సంక్షేమం అందేలా ప్రణాళిక తయారు చేసి క్యాలెండర్ ప్రకారం అమలుచేస్తున్నారన్నారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా ఆయా పథకాల లబ్ధిదార్లను వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో ఎంపిక చేసి ప్రయోజనాన్ని బ్యాంక్ అకౌంట్‌లలో నేరుగా జమ చేస్తున్నారన్నారు. ఇలాంటి మంచి నాయకున్ని రాబోయే 2024 ఎన్నికల్లో ఓటర్లు ఆదరించి మరో మారు అధికారం అప్పగించాలని కోరారు. కొత్తపల్లి సర్పంచ్ నరెడ్ల ఓగిరెడ్డి, మాజీ సర్పంచ్ వంగల వైకుంఠం, ఎంపీటీసీ సభ్యులు పరిటాల పద్మ, ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కె.శామ్యూల్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ నర్సారెడ్డి, జి.చెన్నకేశవరెడ్డి, ఆలపాటి ఉమా, ఏఎంసీ వైస్ చైర్మన్ సీహెచ్ వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ కె.దాసు, నాయకులు ఎన్.జమలారెడ్డి, ఎన్. జానకీరామిరెడ్డి, కె.కోటేశ్వరరావు, జి.శ్రీనివాసరెడ్డి, నల్లగట్ల బాలు, సుబ్బారెడ్డి, ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు



బొమ్మల కొలువు ఏర్పాటుచేసిన చిన్నారులు



భోగి మంటల చుట్టూ నృత్యం చేస్తున్న దృశ్యం



గంగిరెద్దు విన్యాసాలు

విస్సన్నపేట: మండల కేంద్రంలోని సిద్ధార్థ ఎలైట్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చిన్నారులు బొమ్మల కొలువులు, భోగిమంటలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ మేడా మోహనరావు, డైరెక్టర్లు మేడా దీప్తి, శ్రీహర్ష, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

కేతనకొండ(ఇబ్రహీంపట్నం):సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మంగళవారం కేతనకొండ గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా వివిధ తరగతుల బాలికలు ఉత్సాహంగా ముగ్గుల పోటీల్లో పాల్గొని రంగవల్లులు తీర్చిదిద్దారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థునులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం నాగమల్లేశ్వరి, ఎస్‌ఎంసీ చైర్మన్ నూర్జహాన్, ఉపాధ్యాయులు ఇర్ఫాన్ పఠాన్, అనూరాధ పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని పోలవరం కేపీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగు రంగుల ముగ్గులు, భోగి మంటలు వేసి గాలిపటాలు ఎగురవేశారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలైన విద్యార్థులకు హెచ్‌ఎం ఆర్.నాగేశ్వరరావు బహుమతులు పంపిణీ చేశారు.

రేపు ముగ్గుల పోటీలు

విస్సన్నపేట:సంక్రాంతి సందర్భంగా ప్రజాసంఘాల ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఈ నెల 12వ తేదీ నుంచి ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వి. నాగరాజు మంగళవారం తెలిపారు. విజేతలకు బహుమతులు అందిస్తామని పేర్కొన్నారు.

తిరువూరు: పట్టణంలోని శ్రీవాహిని ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగి మంటలు, కోలాట ప్రదర్శనలతో విద్యార్థులు సందడి చేశారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల హరి నామస్మరణలతో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు, సంప్రదాయ వస్త్ర ధారణ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల కమిటీ చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, కరస్పాండెంట్ పోట్రు నాగేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హిందీ పరీక్షలో విద్యార్థినుల ప్రతిభ

మునుకుళ్ళ(తిరువూరు):మండలంలోని మునుకుళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ హిందీ దినోత్సవం నిర్వహించారు. హిందీ భాష ప్రాముఖ్యతను ప్రథమ శ్రేణి హిందీ ప్రచారక్ రేపాక రఘునందన్ వివరించారు. జాతీయ భాషగా హిందీ అత్యధిక రాష్ట్రాల్లో వాడుకలో ఉన్నందున ప్రతి ఒక్కరూ ఈ భాష నేర్చుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు బి.వీరభద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఢిల్లీకి చెందిన సిల్వర్ జోన్ సంస్థ ఇటీవల నిర్వహించిన హిందీ ప్రతిభా పరీక్షలో బంగారు పతకాలు సాధించిన 14 మంది విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

మాదక ద్రవ్యాలు అరికట్టాలి

రెడ్డిగూడెం: మత్తు, మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు యువత సహకరించాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ గిరిజ అన్నారు. మండలంలోని రంగాపురం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులం ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు మత్తు, మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ గిరిజ మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపులు, మాదక ద్రవ్యాలు, మత్తు ప్రదార్థాలు వినియోగం వల్ల కలిగే నష్టాలు గురించి అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ ఎస్.సబిత పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

నూజివీడు: సంక్రాంతి పర్వదినం సందర్భంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని ధర్మ అప్పారావు కళాశాలలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఈ పోటీల్లో పట్టణంలోని జోన్స్ జట్టు ప్రథమ స్థానంలో, నెహ్రూపేట జట్టు ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేత జట్లకు తహసీల్దార్ డీవీఎస్ యల్లారావు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ప్రథమస్థానంలో నిలిచిన జట్టుకు రూ.5వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.4వేలు నగదును అందజేశారు. ఈ నెల 12, 13 తేదీల్లో డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. డీవైఈవో సేవియా, ఆర్ఐ సాయినాథ్, పీడీలు పి.రవీంద్ర, వనజ, రాణి, స్వప్న, నాగేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, కీర్తికాంత్, పుల్లారావు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసఫ్ జట్టు విజేత

మునునూరు: క్రీడలతో దేహదారుఢ్యంతో పాటు, సమయస్ఫూర్తి అలవడుతుందని జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్ అన్నారు. రెవెన్యూ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా నిర్వహించిన వాలీబాల్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఫైనల్ పోటీలో ఆది నుంచి విశేష ప్రతిభ కనబరచిన మునునూరు సెయింట్ జోసఫ్ జట్టు విజేతగా నిలిచింది. రమణక్కపేట జట్టు ద్వితీయ స్థానం సాధించింది. అనంతరం తహసీల్దార్ దాసరి సుధ అధ్యక్షతన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ, ద్వితీయ జట్లకు నగదు బహుమతులతోపాటు జ్ఞాపికలను అందజేశారు. డీటీ కుమారి, ఆర్ఐ చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యులు చీలి లక్ష్మి అర్లప్ప, ఉపాధ్యాయుడు బెనర్జీ, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో నాయకత్వ లక్షణాలు



ఫైరింగ్‌పై అవగాహన కలిగిస్తున్న ఎన్‌సీసీ అధికారి

నూజివీడు: ఎన్‌సీసీలో చేరడం వల్ల విద్యార్థి దశ నుంచే దేశ రక్షణ వ్యవస్థపై అవగాహన కలగడంతో పాటు నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ అలవడతాయని ఎన్‌సీసీ క్యాంప్ కమాండ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాకేష్ యాదవ్ అన్నారు. స్థానిక ట్రిపుల్‌ఐటీలో 17వ ఆంధ్రా బెటాలియన్ ఏటీసీ క్యాంప్–2 ఈనెల 9న ప్రారంభమైంది. 16వ తేదీ వరకు ఈ క్యాంప్ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా 600 మంది పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్‌లనుద్దేశించి మంగళవారం రాకేష్ యాదవ్ మాట్లాడుతూ ఈ శిక్షణ శిబిరంలో ఫైరింగ్, వెపన్ ట్రైనింగ్, డ్రిల్, మ్యాప్ రీడింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని చెప్పారు. శారీరకంగా, మానసికంగా బలోపేతం కావడంతో పాటు విద్యార్థులు క్రమశిక్షణ కలిగిన పౌరులుగా తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు. క్యాంపు డెప్యూటీ కమాండెంట్ మేజర్ కనకలత, సుబేదార్ మేజర్ రాజ్‌సింగ్ పాల్గొన్నారు.

ఉపాధి రికార్డులు సక్రమంగా ఉండాలి

విస్సన్నపేట: ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లు రికార్డులు సక్రమంగా నమోదు చేయాలని, నూతనంగా వచ్చే యాప్‌లను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని డ్వామా పీడీ జె. సునీత ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద 11 గ్రామ పంచాయతీల్లో 2020–21, 2021–22 సంవత్సరాల్లో జరిగిన ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం నిర్వహించారు. చెరువుల్లో నీరు ఉండటం వల్ల అభివృద్ధి పనులు కొలతలు తీయలేదని సామాజిక తనిఖీ బృంద సభ్యులు తెలిపారు. కాలువలు, ఎవిన్యూ ప్లాంటేషన్, హార్టీకల్చర్ పనులు పరిశీలించామని పేర్కొన్నారు. నివేదికను పీడీ సమక్షంలో వివరించారు. 2020–21, 2021–22 సంవత్సరాల్లో 1294 పనులకు రూ.26,05,42,122 నిధులు వినియోగించామని వెల్లడించారు. జెడ్పీటీసీ భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, ఏపీడీ మున్నీ, ఎంపీడీఓ ఎస్. వెంకటరమణ, ఈఓపీఆర్డీ ఝాన్సీరాని, ఎస్ఆర్పీ జగన్నాథం, ఏపీఓ అనురాధ పాల్గొన్నారు.

నేడు పోలీస్‌స్టేషన్ ప్రారంభం



ఆగిరిపల్లి: అత్యాధునిక హంగులతో నిర్మించిన పోలీస్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. ఎన్నో ఏళ్లుగా రేకుల షెడ్డులో కునారిల్లుతున్న స్టేషన్ నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సహకారంతో నిర్మాణానికి పునాది పడింది. ఫ్రెండ్లీ పోలీసింగ్, పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన వారిని పలకరించి వారితో మాట్లాడటానికి రిసెప్షన్‌ను ఏర్పాటు చేశారు. ప్రత్యేక వెయిటింగ్ హాలు, మహిళా సిబ్బంది ప్రత్యేక విశ్రాంతి గది, పోలీస్‌స్టేషన్ భవనంపై సిబ్బందికి అదనపు విశ్రాంతి గదుల నిర్మాణం, ట్రాఫిక్ నియంత్రించేందుకు సీసీ కెమెరాలతో మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు రూ.5 లక్షల నిధులు, నెక్కలం గొల్లగూడెం కుశలవ సంస్థ, వట్టిగుడిపాడు విమల ఫీడ్స్, పోతవరప్పాడు ఎన్ఆర్ఐ ఇంజినీరింగు కళాశాల, తాడేపల్లి చొప్పరమెట్ల కేకేఆర్ హ్యాపీ వ్యాలీ స్కూల్‌లు కలిపి రూ.10 లక్షల చొప్పున రూ.40 లక్షలు, విజయవాడకు చెందిన పారిశ్రామికవేత్త పొట్లూరి వెంకట కృష్ణారావు రూ.5 లక్షలు కలిపి మొత్తం రూ.50 లక్షలతో నిర్మాణం చేపట్టారు. పోలీస్‌స్టేషన్‌ను బుధవారం హోం మంత్రి తానేటి వనిత, నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లపై ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ మంగళవారం సాయంత్రం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

ఏపీ ఉపాధ్యాయ సంఘం ఎన్టీఆర్ జిల్లా డైరీ ఆవిష్కరణ

మైలవరం: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఎన్టీఆర్ జిల్లా డైరీని, క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈఓ సీ.వీ. రేణుక మంగళవారం ఆవిష్కరించినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి కే. శంకరరావు తెలిపారు. రేణుక మాట్లాడుతూ దేశ భక్తిని పెంపొందించే విధంగా, సంస్కృతికి సాంప్రదాయాలు ఉట్టిపడేలా ఆకర్షణీయంగా క్యాలెండర్ రూపొందించినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఎ.కృష్ణమోహన్‌రావు, జిల్లా కోశాధికారి టి. కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

సగరులను బీసీ-ఏ కేటగిరిలో చేర్చాలి

మునునూరు: సగరులను బీసీ–ఏ కేటగిరిలో చేర్చాలని సగర సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుర్రం రవికుమార్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని చెక్కపల్లి గ్రామంలో మంగళవారం సగర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కుప్పాల ఆంజనేయులు ఆధ్వర్యంలో సంఘ జిల్లా అధ్యక్షుడు గుళ్లపల్లి నాగేశ్వరరావు అధ్యక్షతన మహాసభ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రవికుమార్ మాట్లాడుతూ సగరులను బీసీ–డి నుంచి బీసీ–ఎ కేటగిరిలో చేర్చి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అధ్యక్ష, కార్యదర్శులుగా తల్లిబోయిన సంపతరావు, జ్యోతి వరప్రసాద్, ఉపాధ్యక్ష, సంయుక్త కార్యదర్శులుగా వజ్రా జాన్‌బాబు, రెడ్డి తిరుపతిరావు, కోశాధికారిగా గుర్రం గోపాలస్వామిని ఎన్నుకున్నారు. సర్పంచ్ తల్లిబోయిన రాధిక సత్యనారాయణ, కఠారి సంసోన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ధనుర్మాసోత్సవాలు

తిరువూరు: వేంకటాచలస్వామి దేవస్థానంలో తిరుప్పావై, సేవాకాలం అనంతరం మాల మార్పిడి ఉత్సవం చేశారు. రాజుపేట వీరాంజనేయ స్వామి దేవస్థానంలో తిరుప్పావడ, అప్పాల వడ సేవ, నవహారతులు కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి రంగాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజలకు పారదర్శకమైన సేవలు అందించాలి

జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్



జూపూడి సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ పక్కన ఎంపీడీవో రామకృష్ణ

జూపూడి(ఇబ్రహీంపట్నం): గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు పారదర్శక సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్ అన్నారు. జూపూడి గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు అటెండెన్స్ రిజిష్టర్ పరిశీలించారు. లబ్ధిదారుల వివరాలపై ఆరా తీశారు. అనంతరం ఎంపీపీ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ప్రభుత్వ మెనూ ప్రకారం పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం అందించాలని సూచించారు. అంగన్‌వాడీలో బాలింతలు గర్భిణులు, చిన్నారుల పౌష్టికాహారం పంపిణీ పరిశీలించారు. ఎంపీడీవో రామకృష్ణనాయక్, తహసీల్దార్ సూర్యారావు, కార్యదర్శి మునేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం

– ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



అడవినెక్కలంలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని అడవినెక్కలంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం రెండవ రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల వివరాల బ్రోచర్‌ను అందించారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు, పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు, రైతన్నల సంక్షేమానికి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి పార్టీలకు అతీతంగా అమలు చేస్తున్నారని వివరించారు. గ్రామ వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలను ఎటువంటి లంచాలకు తావులేకుండా నేరుగా లబ్ధిదారులకే అందిస్తున్నామన్నారు. ఉప సర్పంచ్ కొల్లిపర ఝాన్సీ, వైఎస్సార్ సీపీ నాయకులు మొక్కపాటి కిరణ్, వేము రాజు, మాజీ సర్పంచ్ మొక్కపాటి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ మొక్కపాటి శ్రీనివాసరావు, నాయకులు లింగంనేని శివరామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి మచ్చా హరిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, ఎంపీపీ గోళ్ళ అనూష ఇసాక్, అధికారులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు



చీమలపాడు సచివాలయంలో మాట్లాడుతున్న తహశీల్దార్ వెంకటేశ్వర్లు

ఎ.కొండూరు:సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలంలోని చీమలపాడు, గోపాలపురం, మాధవరం గ్రామాల్లో మంగళవారం గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే తమకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. కోడి పందేలు, పేకాట శిబిరాలు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐ ఆర్.అంకారావు, ఆర్ఐ స్రవంతి, జెడ్పీటీసీ భూక్య గనియా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పలువురు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలు

మైలవరం:కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్. సుధాకర్ తెలిపారు. సీఐటీయూ 17వ ఆలిండియా మహాసభలు బెంగళూరులో జరుగుతున్న సందర్భంగా సంఘం జెండాను మంగళవారం ఆవిష్కరించారు. లేబర్ కోడ్స్ వల్ల కార్పొరేట్‌లకు అనుకూలంగా బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక కోడ్స్‌ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కొన్ని రోజులుగా జరుగుతున్న పోరాటంలో కార్మికులు వీరోచితంగా పోరాడుతున్నారన్నారు. సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు వి. శ్రీనివాసరావు, పి.జ్యోతి, పి.శైలజ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఝాన్సీ, రమాదేవి, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలకు తరలిరండి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం):బెంగళూరులో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు జరగనున్న సీఐటీయూ 17వ ఆలిండియా మహాసభలకు కార్మికులు తరలిరావాలని ఎన్టీఆర్ జిల్లా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కొండపల్లి ఐడీఏలో మంగళవారం సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. నర్సింగరావు, మండల కార్యదర్శి ఎం.మహేష్, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



నియామక పత్రాన్ని అందుకుంటున్న పిల్లి సుబ్రహ్మణ్యం, మిక్కిలి బాలకోటేశ్వరరావు

రెడ్డిగూడెం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ మండలశాఖ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం నిర్వహించారు. యూటీఎఫ్ మండలశాఖ నూతన అధ్యక్షుడిగా పిల్లి సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా మిక్కిలి బాలకోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నియ్యారు. నియామక పత్రాన్ని యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షురాలు, ఎన్నికల అధికారి డి. అపర్ణ అందజేశారు. ఉపాధ్యక్షుడిగా కట్టా రవిబాబు, ఎస్ఎస్ సుజాత, కోశాధికారిగా మల్లాది తిరుపతిరావు, కార్యదర్శులుగా ఎ.వేణుబాబు, ఎ.బిక్షాలు, జి.రవినాథ్, జి. ప్రసాదరెడ్డి, కట్టా విజయ్‌కుమార్, ఆడిటర్‌గా చింతిరాల లక్ష్మయ్య ఎన్నికయ్యారు. ఎన్టీఆర్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మచ్చ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు పటాపంచల భవాని, బీసీహెచ్‌వీ సూర్యనారాయణ, ఉమ్మడి కృష్ణా పూర్వ గౌరవ అధ్యక్షుడు డి. శ్రీనివాసరెడ్డి, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

50 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



తిరువూరులోని రైస్‌మిల్లులో నిల్వచేసిన రేషన్ బియ్యం

తిరువూరు: రాజుపేటలోని ఓ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన 50 క్వింటాళ్ల బియ్యాన్ని పౌరసరఫరాల అధికారులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పీడీఎస్ డెప్యూటీ తహసీల్దార్ శ్వేత తెలిపిన వివరాల ప్రకారం... రైస్‌మిల్లులో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేసినట్లు అందిన సమాచారం మేరకు దాడి నిర్వహించామని తెలిపారు. ఇందుకు బాధ్యులైన హరికృష్ణ, రాజు అనే వ్యక్తులపై కేసు నమోదు చేశామని చెప్పారు. 6–ఏ సెక్షన్ కింద కేసు నమోదుచేసినట్లు పేర్కొన్నారు.

వాలీబాల్ విన్నర్‌గా చిత్తపూరు

చాట్రాయి: సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని చిత్తపూరు గ్రామంలో మండల స్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విన్నర్‌గా చిత్తపూరు, రన్నర్‌గా చిత్తపూరు పడమట ఎస్సీ కాలనీ జట్టు నిలిచాయి. విన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.5 వేలు, రన్నర్‌గా నిలిచిన జట్టుకు రూ.4 వేలు చొప్పున తహసీల్దార్ విశ్వనాథరావు బహుమతులు అందజేశారు.